దక్షిణ ఆసియా సదస్సుకు ఖమ్మంవాసికి ఆహ్వానం

పగడాల సాయి ప్రియాంక

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 17 : శ్రీలంక దేశంలోని కొలంబోలో నిర్వహించనున్న దక్షిణ ఆసియా-2024 న్యూట్రిషియన్ సదస్సుకు ఖమ్మంవాసి సైంటిస్ట్ పగడాల సాయి ప్రియాంక భారత్ తరపున ప్రాతినిధ్యం వహించాలని ఆహ్వానం అందింది. సాయి ప్రియాంక ప్రస్తుతం జహీరాబాద్‌లో ఎక్స్‌టెన్షన్ సైంటిస్ట్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యువ మహిళా శాస్త్రవేత్తగా కొలంబో ప్రభుత్వ ఆహ్వానం మేరకు డిసెంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు జరిగే సదస్సులో పాల్గొనున్నారు. ఆహ్వానం పట్ల తల్లిదండ్రులు రాజ రాజేశ్వరి, నరసింహారావు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై చర్యలు తీసుకోవాలి

ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ చంద్రకళ

ఖమ్మం, అక్టోబర్ 17 : దేశ వ్యాప్తంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌ల వల్ల అనేకమంది యువత ప్రాణాలు బలి తీసుకుంటున్నారని, వాటిపై సమగ్రమైన విచారణ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఖమ్మం నగరానికి చెందిన 25వ డివిజన్ కార్పొరేటర్ గోళ్ల చంద్రకళవెంకట్ గురువారం ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఖమ్మం పర్యటనకు వచ్చిన ఈటలను విశ్రాంతిభవన్‌లో కలిశారు. కార్పొరేటర్‌తోపాటు బీఆర్ఎస్ నాయకుడు గోళ్ల వెంకట్ తదితరులు ఉన్నారు. ఖమ్మం నగరం 7వ డివిజన్ పరిధి ఖానాపురంలో ఛత్రపతి శివాజీ సంకల్ప యాత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఈటల ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు

వేంసూరు, అక్టోబర్ 17: డీఎస్సీ-2024లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు చలంచర్ల వెంకటేశ్వరరావు గురువారం నియామకపత్రాలు అందజేశారు. ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలలో చేరారు. మండలానికి 43 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారన్నారు. నూతన ఉపాధ్యాయులను పీఆర్‌టీయూ, యూటీఎఫ్ సంఘాల బాధ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

కోటమైసమ్మ హుండీ ఆదాయం రూ.7,03006

హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

కారేపల్లి, అక్టోబర్ 17: మండల పరిధిలోని ఉసిరికాయలపల్లిలో వారం రోజులపాటు జరిగిన కోటమైసమ్మ జాతరకు సంబంధించిన హుండీ ఆదాయాన్ని దేవాదాయశాఖ ఆధ్వర్యంలో గురువారం లెక్కించారు. హుండీల ద్వారా రూ.7,03,006 వచ్చినట్లు దేవాలయ చైర్మన్ పర్సా పట్టాభిరామారావు తెలిపారు. గత ఏడాది కంటి ఈ సంవత్సరం రూ.7వేలు ఎక్కువగా వచ్చినట్లు పేర్కొన్నారు. కొండకింది వేణుగోపాలాచార్యులు, అనిల్‌కుమార్, పగడాల మోహన్‌కృష్ణ, పర్సా సాయి, మోహన్ పాల్గొన్నారు.

సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు

కొణిజర్ల, అక్టోబర్ 17: కొణిజర్ల మండలంలో 14,600 ఎకరాల్లో పత్తి సాగు చేశారని మండల వ్యవసాయశాఖాధికారి బాలాజీ తెలిపారు. గురువారం మండలంలో రైతులు సాగు చేస్తున్న పత్తి పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయడం ప్రారంభించిందని, జిల్లాలో 9 కాటన్ జిన్నింగ్ మిల్లుల్లో ఉన్న సెంటర్లలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేశారని, రైతులు గ్రామాల్లోకి వచ్చే దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్మి మోసపోవద్దని సూచించారు. సీసీఐ మార్కెట్ రేటు క్వింటాకు రూ.7521 ధర నిర్ణయించిందని, తేమ 8 నుంచి 12 శాతం ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

తెగిపోయిన బ్రిడ్జిలు, రోడ్లకు మోక్షమెప్పుడో?

వరదలతో దెబ్బతిన్న వాటికి మరమ్మతులు కరువు

తాత్కాలిక మట్టి రోడ్లపై ప్రజలు, వాహనదారుల అవస్థలు

మంత్రి ఇలాకాలో మండలం ఉన్నా పట్టించుకోని పరిస్థితి

ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లినా కదలిక లేదాయె..

రావిచెట్టుతండా వద్ద కొట్టుకుపోయిన ఆకేరు బ్రిడ్జి(ఫైల్)

తిరుమలాయపాలెం, అక్టోబర్ 17: దాదాపు నెల న్నర క్రితం కురిసిన భారీ వర్షాలు, వరదలతో మండలం అంతా అతలాకుతలమైంది. మండలంలో కురిసిన వర్షానికి తోడు ఎగువ నుంచి వరద తోడు కావడంతో ఆకేరు వాగు ఉగ్రరూపం దాల్చింది. దీంతో వారధులు కూలిపోయాయి. రోడ్లన్నీ కొట్టుకుపోయాయి. పొలాల్లో ఇసుక మేటలు వేశాయి. ఇన్ని రోజులు గడిచినా.. ఈ మండలం మంత్రి పొంగులేటి ఇలాకాలో ఉన్నా నిర్మాణాలకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఆయా మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. హైదర్‌సాయిపేట సమీపంలోని రావిచెట్టుతండా వద్ద రూ.16 కోట్ల వ్యయంతో గత కేసీఆర్ ప్రభుత్వ హయాంతో అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆకేరుపై బ్రిడ్జి నిర్మించారు. దీని ద్వారా మహబూబాబాద్-ఖమ్మం జిల్లాల సరిహద్దు గ్రామాలకు రహదారి సౌకర్యం సుగమమైంది. అయితే ఆ బిడ్జి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రహదారి సౌకర్యం నిలిచిపోయింది. అజ్మీరాతండా-రాకాశితం డా మధ్యలో ఆకేరుపై నిర్మించిన బ్రిడ్జి అప్రోచ్ బీటీ రోడ్డు తెగిపోయింది. తిరుమలాయపాలెం-ముల్కలపల్లి మధ్యలో ఆకేరుపై నిర్మించిన బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు సైతం దెబ్బతిన్నది. తాళ్లచెరువు రహదారిలో కొక్కెరేణి-ఎర్రగడ్డ మధ్య, మరిపెడ బంగ్లా-బచ్చోడు రహదారిలో సుబ్లేడు-హస్నాబాద్ సమీపంలో, బీరోలు-కాకరవాయి రహదారిలో బంధంపల్లి వద్ద బీటీ రోడ్లు తెగిపోయాయి. మేడిదపల్లి-సుబ్లేడు మధ్యలో రోడ్డు దెబ్బతిన్నది. అయితే తెగిపోయిన బీటీ రోడ్ల వద్ద తాత్కాలికంగా మట్టి రోడ్లు వేసి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. అడపా దడపా కురుస్తున్న వర్షాలతో మట్టి రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి పొంగులేటి ఇలాకాలో దెబ్బతిన్న రోడ్లు, బ్రిడ్జిల పునర్నిర్మాణాలకు మోక్షం లేకపోవడం పట్ల వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మంత్రి, ఉన్నతాధికారులు చొరవ తీసుకొని తెగిపోయిన బీటీ రోడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో షేక్ శిలార్‌ను వివరణ కోరగా.. దెబ్బతిన్న రోడ్ల నిర్మాణాలకు ఆయా శాఖల అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు పేర్కొన్నారు.

రహదారి సౌకర్యాన్ని పునరుద్ధరించాలి..

భారీ వర్షాలు, వరదలతో హైదర్‌సాయిపేట వద్ద ఆకేరు బ్రిడ్జి బీటీ రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఖమ్మం-మహబూబాబాద్ జిల్లాల సరిహద్దు గ్రామాలకు రహదారి సౌకర్యం నిలిచిపోయింది. గత కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఈ బ్రిడ్జి ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగపడింది. మంత్రి పొంగులేటి చొరవ తీసుకొని బ్రిడ్జి, బీటీ రోడ్డు పనులను పూర్తి చేయాలి. మళ్లీ రహదారి సౌకర్యాన్ని పునరుద్ధరించి అందుబాటులోకి తేవాలి. **– భద్రునాయక్, హైదర్‌సాయిపేట**

వాల్మీకి జయంతి వేడుకలు

మధిర రూరల్ : నివాళి అర్పిస్తున్న నాయకులు

మధిర రూరల్, అక్టోబర్17: వాల్మీకి జయంతి పురస్కరించుకుని మండలంలోని ఆత్కూరు గ్రామంలో వాల్మీకి యువసేవ ఆధ్వర్యంలో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మీనుగు చైతన్య, అంకె అప్పారావు, మీనుగు శంకర్, పికికలి పుల్లయ్య, స్వామి వెంకటయ్య, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సత్తుపల్లి, అక్టోబర్ 17: రామాయణాన్ని రచించిన వాల్మీకి జయంతిని మండలంలోని గంగారం 15వ బెటాలియన్‌లో నిర్వహించారు. తొలుత వాల్మీకి చిత్రపటానికి బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ ఛటర్జీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు వాల్మీకి గొప్పతనాన్ని వివరించడం కోసం ఈ జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్‌డీ రంగారెడ్డి, బెటాలియన్ అధికారులు పాల్గొన్నారు.

పెద్దమ్మ దేవాలయంలో పూజలు

కారేపల్లి, అక్టోబర్ 17: మండల కేంద్రంలోని పెద్దమ్మ దేవాలయంలో కులమతాలకతీతంగా పూజలు నిర్వహించినట్లు ఆలయ పునర్నిర్మాణకర్త మండెపూడీ శ్రీనివాసరావు తెలిపారు. కారేపల్లిలోని ఆయన నివాసంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామస్తులు, దాతలు, నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మ ఆలయం అందరిదని స్పష్టం చేశారు. సమావేశంలో ఎలందుల మధు, ఓరుగంటి రాజు, చిరునోముల రామారావు, రావూరి నాగేశ్వరరావు, కంచి పవన్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

వైరాటౌన్, అక్టోబర్ 17: వైరా మండల ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్, కొల్లా రాంబాబు, సముద్రాల మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం ఉపాధ్యక్షుడిగా చందూనాయక్

కారేపల్లి, అక్టోబర్ 17: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడిగా కారేపల్లికి చెందిన భూక్యా చందూనాయక్‌ను నియమిస్తూ చైర్మన్ చీమ శ్రీనివాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చందూనాయక్‌ను పలువురు అభినందించారు.

నాగేశ్వరరావుకు నివాళి

పెనుబల్లి, అక్టోబర్17: మండలంలోని మండలపాడు గ్రామానికి చెందిన ఇడుపులపాటి నాగేశ్వరరావు ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు గురువారం మృతుడి నివాసానికెళ్లి నాగేశ్వరరావు చిత్రపటానికి నివాళి అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళి అర్పించిన వారిలో కోట ప్రభాకర్, తాతారావు, చంటి, ప్రకాశ్, వెంకీ తదితరులు ఉన్నారు.

నూతన ఉపాధ్యాయులతో కలెక్టర్ నేడు ముఖాముఖి

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 17 : డీఎస్సీ-2024 ద్వారా జిల్లాలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరిన విషయం తెలిసిందే. వీరితో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ముఖాముఖి నిర్వహించి వారికి తగిన మార్గదర్శనం చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఈ. సోమశేఖరశర్మ తెలిపారు. ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం ఉదయం 11గంటలకు నూతన ఉపాధ్యాయులతో కలెక్టర్ ముఖాముఖి ఉంటుందని, ఉపాధ్యాయులంతా 10గంటలకల్లా హాజరుకావాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణపై ఎంఈఓలతో గురువారం డీఈవో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఉద్యాన రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

డ్రాగెన్‌ఫ్రూట్ పంటలను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి

మధిర, అక్టోబర్ 17: నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం, చింతకాని మండలాల్లోని ఆయిల్‌పాం, బొప్పాయి, డ్రాగెన్‌ఫ్రూట్ పంటలను జిల్లా ఉద్యాన అధికారి వీ మధుసూదన్ గురువారం పరిశీలించారు. పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యాన పంటల సాగు చేస్తున్న రైతులు జాగ్రత్తలు తీసుకుని ఎరువులు వాడకం, యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. రైతులకు ఉద్యాన పంటల సాగుతో అధిక ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మధిర ఉద్యాన అధికారి విష్ణు, రైతులు పాల్గొన్నారు.

కేయూ దూరవిద్య ప్రవేశాలకు గడువు పొడిగింపు

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 17 : కేయూ దూరవిద్యలో డిగ్రీ, పీజీ, డిప్లొమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు పీజీ కళాశాల అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గోపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 43 కోర్సులకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9849250633లో సంప్రదించాలని కోరారు.

ఒలింపియాడ్‌కు హార్వెస్ట్ విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, అక్టోబర్ 17 : గణితశాస్త్రంలో విద్యార్థుల నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు నిర్వహించే ప్రతిష్టాత్మక గణిత ఒలంపియాడ్ పరీక్ష 'రీజనల్ మ్యాథ్స్ ఒలంపియాడ్'కు నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామసహాయం పార్వతిరెడ్డి గురువారం తెలిపారు. ద్వితీయ లెవల్‌కు జిల్లా నుంచి ఎంపికైన ఏకైక పాఠశాల హార్వెస్ట్ అని పేర్కొన్నారు. విద్యార్థులను కరస్పాండెంట్ పోపూరి రవిమారుత్ అభినందించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగొద్దు

మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి

వేంసూరు, అక్టోబర్17: రైతులు ఆరుగాలం పండించిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేసే క్రమంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని ఐకేపీ, సొసైటీల సభ్యులకు మండల ప్రత్యేక అధికారి హుస్సేన్‌నాయక్ తెలిపారు. గురువారం స్థానిక రైతువేదికలో ఐఏపీ, సొసైటీ సీఈవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం సన్న, దొడ్డి రకాల ధాన్యాన్ని కేంద్రాల్లో కొంటున్న నేపథ్యంలో ఎవరైతే ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారో ఆ కేంద్రాల వద్ద పరదాలు, టెంట్లు, కుర్చీలు, మంచినీళ్లు, టాయిలెట్స్ ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దు గ్రామాల్లోని కేంద్రాల వద్దకు ఆంధ్రా రాష్ట్రం నుంచి అక్రమంగా ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లైతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ ఎంఏ రాజు, ఎంపీడీవో రమాదేవి, ఎంపీవో రంజిత్‌కుమార్, ఏపీఎం శ్రీనివాస్, సత్తుపల్లి మార్కెట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు చేప పిల్లల పంపిణీ

మత్స్యకారులకు చేప పిల్లలు అందజేస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం, అక్టోబర్ 17: మండలంలోని మత్స్యకారులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో షేక్ శిలార్ మత్స్య సొసైటీ సభ్యులకు చేప పిల్లలను అందజేశారు. మత్స్య సొసైటీల పరిధిలోని చెరువులకు, గ్రామపంచాయతీల పరిధిలోని చెరువులకు చేప పిల్లలను అందజేశామన్నారు. కార్యక్రమంలో మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విలీన సభను జయప్రదం చేయండి

కొణిజర్ల, అక్టోబర్ 17: అక్టోబర్ 20న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని కోరుతూ నాయకులు గురువారం గోడపత్రికను ఆవిష్కరించారు. ఆలకుంట శ్రీనివాసరావు, ఆలకుంట బలరాం, ఎత్తరా వెంకన్న, అజయ్, గోపి రమేశ్, గోగుల సోములు, రాపోలు కృష్ణ, గండికోట బాబు, గండికోట రమేష్, ఆలకుంట వెంకన్న, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు, పీఆర్‌సీ ప్రకటించాలి

కొణిజర్ల, అక్టోబర్ 17: పెండింగ్‌లో ఉన్న 5 డీఏలతో పాటు, 30 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే నూతన పీఆర్‌సీని ప్రకటించాలని పీఆర్‌టీయూ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి పీ.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొణిజర్ల మండల 11వ మహాసభ టీఎస్‌యూటీఎఫ్ కొణిజర్ల మండల అధ్యక్షుడు కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. డీ.అబ్రహం, ఎస్.కే.రంజాన్, ఎం.ప్రసాదరావు, ఎ.సుధాకర్, వీ.దామోదర్, సీహోఎస్.వీ.రమణ, ఎస్‌కే. లాల్‌సయ్యద్, కట్టా జ్యోతి, జమలయ్య, నాగేశ్వరరావు, కే.తిరుపయ్య, డీ.శ్రీనివాస్, సీహెచ్.వీరస్వామి, రామకృష్ణ, కే.భార్గవి, కే.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీపీఎం మండల కార్యదర్శిగా ప్రభాకర్

ఎర్రుపాలెం, అక్టోబర్ 17: డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తున్న మద్దాల ప్రభాకర్‌ను సీపీఎం మండల నూతన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక శుభమస్తు ఫంక్షన్‌హాల్‌లో జరిగిన సీపీఎం మండల మహాసభలో ప్రభాకర్‌తో పాటు కమిటీ సభ్యులుగా దివ్వెల వీరయ్య, గామాసు జోగయ్య, నల్లమోతు హనుమంతరావు, మేడగాని తిరుపతిరావు, ఆంగోతు వెంకటేశ్వర్లు, సగ్గర్తి సంజీవరావు, తోట సాంబశివరావు, షేక్ నాగుల్‌మీరా, నాగులవంచ వెంకట్రావమ్మ, షేక్ లాల, పసల జార్జిటేషన్, పెసరమల్లి ఈమెలమ్మ, రామిశెట్టి సురేష్, మద్దాల ప్రభాకర్, దూదిగం బసవయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

రఘునాథపాలెం, అక్టోబర్17 : సాగర్ కాలువలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఖానాపురం హవేలీ పోలీసులు తెలిపిన ప్రకారం.. ఖమ్మం నగర పరిధి గోపాలపురం వద్ద సాగర్ కాలువలో మృతదేహం కొట్టుకుపోతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అన్నం ఫౌండేషన్ బృందం సహాయంతో మృతదేహాన్ని వెలికితీశారు. 30ఏళ్ల వయస్సు ఉండి, గుర్తు తెలియని పురుషుడి మృతదేహంగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పిడుగుపడి ఇంటి సామగ్రి దగ్ధం

వేంసూరు, అక్టోబర్ 17: పిడుగు పడి ఇంట్లోని ఎలక్ట్రిక్ సామన్లు దగ్ధమైన ఘటన మండలంలోని మర్లపాడులో గురువారం చోటు చేసుకుంది. మర్లపాడు గ్రామానికి చెందిన ఎన్టీఆర్‌కాలువ పక్కన ఉన్న కనమాల నాగేశ్వరరావు ఇంటిలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులు వచ్చి ఇంటి సమీపంలో పిడుగు పడింది. పిడుగుపాటుకు ఇంటిలోని ఫ్రిడ్జ్, కూలర్, టీవీ, కరెంట్ వైరింగ్‌తో సహా కాలి బూడిదయ్యాయి. ఈ మేరకు కుటుంబ సభ్యులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు.

మధిర బాలోత్సవ్-2024 బ్రోచర్ ఆవిష్కరణ

బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

మధిర, అక్టోబర్ 17: రామభక్త సీతయ్య కళాపరిషత్ మధిర ఆధ్వర్యంలో 27వ జాతీయ మధిర బాలోత్సవ్-2024 బ్రోచర్లను గురువారం పట్టణంలోని లడకబజార్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో ఆ సంఘం అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, సెక్రటరీ బాబ్లా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబర్ 15, 16 తేదీల్లో శ్రీవేంకటేశ్వరస్వామి వారి కల్యాణ మండపంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 15వ తేదీ ఉదయం 10 గంటలకు శాస్త్రీయ నృత్యాలు, జానపద నృత్యాలు, 16న నీతిపద్యాలు, నీ సత్తా చాటుకో, ఏకపాత్రలు, ఉపన్యాసం, దేశభక్తి గీతాలు, సాయంత్రం 5 గంటలకు విచిత్ర వేషాలు ఉంటాయన్నారు. ఎంట్రీఫారాలు నవంబర్ 10వ తేదీ లోపు మధిర బాబ్లా, సెక్రటరీ హౌజ్ నెంబర్ 1-329 బంజారాకాలనీ మధిర-507203, ఖమ్మం జిల్లాకు పంపించాలన్నారు. వివరాలకు 9440675787 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు. కల్యాణం పుల్లారావు, నాగిరెడ్డి, గుండెల ముత్తయ్య, నర్సింహారావు, పసుపులేటి నాగేంద్రశ్రీనివాస్, గడ్డం సుబ్బారావు, శ్రీనివాసుల అనంతచార్యులు, వీరారెడ్డి, చీదిరాల సత్యనారాయణ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, అక్టోబర్ 17: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మత్కేపల్లి నామవరం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. చింతకాని పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డిబోయిన రాంబాబు (31)కు పదేళ్ళ క్రితం వివాహమైంది. భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో మూడేళ్ల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో విడిపోయారు. ప్రస్తుతం ఒంటరిగా ఉంటూ మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 16న మద్యంలో పురుగుల మందు కలిపి తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా గురువారం మృతిచెందాడు. మృతుడికి ఒక కుమారుడు ఉన్నాడు. మృతుడి తండ్రి స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై షేక్ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.19.70 కోట్లు మంజూరు

బోనకల్లు, అక్టోబర్ 17: మండలంలో నూతనంగా నిర్మించనున్న యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్‌కు రోడ్డు కోసం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క నిధులను మంజూరు చేశారు. మండలంలోని గోవిందాపురం నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూల్, పాతర్లపాడు నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూల్, రామాపురం నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూల్, తూటికుంట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఇంటిగ్రేటెడ్ స్కూల్ వరకు బీటీ రోడ్ల అభివృద్ధి కోసం రూ.19.70 కోట్లు కేటాయిస్తూ జీవో జారీ చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

బోనకల్లు, అక్టోబర్ 17: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను మండలంలోని పలుగ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరి దయాకర్ రెడ్డి గురువారం అందించారు. ఉమ్మినేని కృష్ణ, భాగం నాగేశ్వరరావు, సురేశ్, రాంబాబు, మురళీ, కృష్ణ, వెంకట్రావు, వెంకటేశ్వర్లు, యోహాను, సతీశ్ పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

పెనుబల్లి, అక్టోబర్17: శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మమత ఆస్పత్రి ఖమ్మం సహకారంతో మండలంలోని అడవిమల్లెల(లంకాసాగర్) రైతు వేదికలో శనివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు అడవిమల్లెల మాజీ సర్పంచ్ మందడపు అశోక్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

మధిర రూరల్, అక్టోబర్ 17: మండలంలోని తొండలగోపారం గ్రామ పంచాయతీ పరిధి తొర్లపాడు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాయబారపు రమేశ్, చందన బదిలీపై ఖమ్మం వెళ్తున్న సందర్భంగా గురువారం వారిని సన్మానించారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థికసాయం

మధిర, అక్టోబర్ 17: మున్సిపాలిటీలోని హనుమాన్ కాలనీకి చెందిన తాడూరి కొండ డయాలిసిస్ చేయించుకుంటూ ఆర్థికస్థితి బాగాలేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అతని భార్య నాగమణి క్యాన్సర్‌తో మృతిచెందింది. కుమారుడు అరుణ్ చదువు మానేసి కుటుంబ బాధ్యతలు నిర్వహిస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఖమ్మం కోఆపరేటివ్ బ్యాంకు మేనేజర్ మధులిక ఆధ్వర్యంలో మిత్రులు ఆర్థిక సాయంతో హెల్పింగ్ హ్యాండ్స్ సమాజ సేవాసంస్థ ద్వారా రూ.10 వేలు అందజేశారు. బత్తుల రవిచంద్ర, మాధవరపు నాగేశ్వరరావు, అశోక్, నర్సింహారావు, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రాజసాయి మందిరంలో అన్నదానం

పెనుబల్లి, అక్టోబర్ 17: మండలంలోని వీఎం బంజర గ్రామంలోని రాజసాయి మందిరంలో దాతలు అందించిన విరాళాలతో గురువారం అన్నదానం నిర్వహించారు. అన్నదానం చేయదల్చిన వారు ముందుగా ఆలయ కమిటీకి తెలపాలని నిర్వాహకులు జన్నారెడ్డి విజయ తెలిపారు.

విద్యుదాఘాదంతో గేదె మృతి

బోనకల్లు, అక్టోబర్ 17: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని నారాయణపురం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు నంబూరి వెంకటేశ్వరరావుకు చెందిన పాడి గేదె మేత కోసం పొలానికి తోలుకెళ్లాడు. విద్యుత్ ట్రాన్స్‌ఫారానికి చెందిన వైర్లకు విద్యు